నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, బుధవారం 10 జూలై 2024 YADADRI BHUVANAGIRI



చెట్ల పొదల్లో పారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల

## చెట్ల పొదల్లో పాఠశాల

రాజాపేట : మండలంలోని పారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాళ్లు, రప్పలు, చెట్ల పొదల్లో దర్శనమిస్తున్నది. పాఠశాలకు ఇరువైపులా పెద్ద పెద్ద రాళ్లబండలతోపాటు కంపచెట్లు, చెట్ల పొదలు ఉన్నాయి. వాటిలో నుంచి క్రిమికీటకాలు, పాములు పాఠశాల ఆవరణలోకి వస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి చెట్ల పొదలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# విద్యా 'అవస్థ'

**బడులను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు**

**ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం**

- కనీస సదుపాయాలు లేక విద్యార్థుల ఇబ్బందులు
- నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు
- ఉపాధ్యాయుల కొరత.. అనేక చోట్ల ఒక్కరిద్దరే..
- నిలిచిన మన ఊరు-మన బడి.. కాంట్రాక్టర్లు లబోదిబో
- సకాలంలో అందని మధ్యాహ్న భోజనం బిల్లులు



యాదగిరిగుట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో అపరిశుభ్ర ప్రదేశ్‌లో మధ్యాహ్న భోజన వంటకాలు

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికొదిలేసింది. నిరుపేదలు చదివే సర్కారు పాఠశాలలను పట్టించుకోవడమే మానేసింది. కనీసం సదుపాయాలు లేకపోవడంతో స్టూడెంట్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నత్తనడకన సాగుతున్నాయి. పిల్లలున్నా టీచర్లు లేకపోవడంతో నాణ్యమైన విద్య దొరుకడంలేదు. ఇక మన ఊరు-మన బడి పథకాన్ని అటకెక్కించారు. మధ్యాహ్న భోజనం బిల్లులు సకాలంలో రావడం లేదు.

– యాదాద్రి భువనగిరి, జూలై 9 (నమస్తే తెలంగాణ)

### అమ్మ ఆదర్శ పాఠశాల పనులు అంతంతే..

జిల్లాలో అన్ని రకాల పాఠశాలలు, రెసిడెన్షియల్స్, ఎయిడెడ్ తదితర కలిపి సుమారు 924 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారు లక్ష మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీని కింద టాయిలెట్లు, తాగునీరు, మైనర్, మేజర్, మరమ్మతులు, విద్యుత్ తదితర పనులు చేపట్టాలి. జిల్లాలో 532 పాఠశాలల్లో 3,192 పనులకుగానూ రూ. 23కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. 476 తాగునీటి పనులు, 651 మైనర్ రిపేర్లు, 754 కరెంట్, 1,251 టాయిలెట్ పనులు, 58 కొత్తగా బాలికలు మరుగుదొడ్ల పనులు ప్రారంభించారు. కానీ జిల్లాలో పనులు ముందుకు సాగడం లేదు. పాఠశాలు పునఃప్రారంభం నాటికే పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ పనులు మెల్లగా నడుస్తున్నాయి. 50శాతం పనులకే నిధులు ఇచ్చినట్లు తెలుస్తున్నది. అనేక చోట్ల పాత భవనాల్లోనే పాఠశాలలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

### ఒక్క జతలే బట్టలే పంపిణీ..

జిల్లాలో విద్యార్థులకు రెండు జతలకు బదులు ప్రభుత్వం ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చింది. ఇంకా ఒక జత బట్టలు రావాల్సి ఉంది. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, ఆదర్శ, అర్బన్ రెసిడెన్షియల్, గురుకుల రెసిడెన్షియల్, ట్రైబల్ రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాల్లో చదువుతున్న 47,931 మంది విద్యార్థులకు యూనిఫాం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని కుట్టేందుకు స్వయంసహాయక సంఘాలకు అందించారు. ఇంకా రెండో జత కుట్టే ప్రక్రియలోనే ఉన్నాయి. మరోవైపు మధ్యాహ్న భోజన బిల్లులు రెండు నెలలుగా అందడంలేదు. కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.

### టెక్ట్స్‌బుక్స్ సగమే వచ్చినయ్..

పాఠశాలలు పునఃప్రారంభమై నెల గడుస్తున్నా ఇంకా విద్యార్థులకు పూర్తి స్థాయిలో నోట్ బుక్స్, టెక్ట్స్‌బుక్స్ అందలేదు. జిల్లాలో 3,13,442 ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలు కావాలి. కానీ ఇప్పటి వరకు 70శాతం బుక్స్ మాత్రమే వచ్చాయి. ఇంకా రెండో విడుత పుస్తకాలు అందాల్సి ఉంది. దాంతో విద్యార్థులు పాత పుస్తకాలతోనే నెట్టుకొస్తున్నారు. విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ అందజేసే కార్యక్రమాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. జిల్లాలో 2,90,049 నోట్ బుక్స్ అవసరం కాగా, ఇప్పటి వరకు 50శాతం కూడా అందలేదని తెలుస్తున్నది.

### పిల్లలు సరే.. టీచర్లేరీ..?

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నది. 12 మంది విద్యార్థులు ఉంటే ఒక టీచర్ ఉండాలి. 24కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ చాలా స్కూళ్లలో సరిగ్గా టీచర్లు లేరు. అనేక పాఠశాలలు ఒక్కరు, ఇద్దరు ఉపాధ్యాయులతోనే నడుస్తున్నాయి. దాంతో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అందరినీ ఒకే దగ్గర కూర్చోబెట్టి చదువు చెబుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇక హైస్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్లు లేరు. కొన్ని చోట్ల ఇంకా పోస్టింగులు ఇవ్వలేదు. దీంతో విద్యార్థుల నాణ్యమైన విద్య అందడంలేదు. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని గొప్పలు చెప్పినా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. ఇక స్కూళ్లలో స్కావెంజర్లు లేరు. గ్రామ పంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నా ఇష్టం ఉన్నప్పుడు వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



### స్కావెంజర్లను నియమించాలి

ప్రభుత్వ పాఠశాల్లో స్కావెంజర్లు లేరు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో చేయిస్తున్నా.. అనేక చోట్ల పనులు జరుగడంలేదు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి. విద్యార్థులకు సరిపడా టీచర్లు లేరు. పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలి. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలి.

**- కొప్పుల శాంతి కుమార్, ఏఐఎస్ఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి**

### నిలిచిన మన ఊరు-మన బడి..

ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు -మన బడి కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. మొదటి విడుతలో భాగంగా జిల్లాలో 251 స్కూళ్లను బాగు చేయాలని ఎంపిక చేశారు. వీటిలో 83 హైస్కూళ్లు, 148 ప్రాథమిక, 20 మాధ్యమిక ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో రూ. 30లక్షల లోపు నిధులు అవసరం ఉన్నవి 225 బడులు, ఇక రూ. 30లక్షల కంటే ఎక్కువ నిధులు కావాల్సినవి 26స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకు పనులు పూర్తయ్యాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మన ఊరు-మన బడి పథకాన్ని అటకెక్కించింది. దీంతో పనులన్నీ ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అంతే కాకుండా చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలేదు. దాంతో వారంతా అధికారుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు.

### పెండింగ్ బిల్లులతో అప్పులపాలు



నెలల తరబడి పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో స్కూళ్లలో మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులపాలవుతున్నారు. కిరాణం షాపులో అరువు తెచ్చుకొని, కొందరు తమ బంగారం కుదువపెట్టి సామగ్రి తెచ్చుకుంటున్నారు. మధాహ్న భోజన కార్మికులకు కనీస కూలీ గిట్టుబాటు కాకపోడంతో చాలా పాఠశాలల్లో వంట ఏజెన్సీల బాధ్యతల నుంచి తప్పుకొంటున్నారు. దాంతో వంట వాళ్లు లేక ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వంట సరుకులు, గుడ్లు, గ్యాస్, నూనె ప్రభుత్వం సరఫరా చేస్తేనే కార్మికులకు ఆర్థిక కష్టాలు తీరుతాయి. మధ్యాన్న భోజన కార్మికులకు కనీస వేతనం 20వేల రూపాయలు ఇవ్వాలి. మెనూ చార్జీలు మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచాలి.

**- మైలారం జంగయ్య, మండల ప్రజా సంఘాల నాయకుడు, బొమ్మలరామారం**

### సరిపడా తరగతి గదులు లేవు



మా స్కూల్‌లో సరిపడా తరగతి గదులు లేవు. క్లాస్ రూమ్‌నే సాయంత్రం డార్మెంటరీగా వాడుతున్నాం. ఒక్క రూమునే రెండింటికీ వాడడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. క్లాసులు ముగిసిన తర్వాత బెంచీలను బయటకి మోయడం. తెల్లారితే లోపలికి తేవడం జరుగుతుంది. ఇక వాష్ రూమ్‌లు కూడా సరిపోను లేవు. ఉదయం స్నానాల కోసం గంటల తరబడి వేచి చూస్తున్నాం. అధికారులు పట్టించుకొని మాకు ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి.

**- అమీనా సమ్రిన్, విద్యార్థిని, కస్తూర్బా పాఠశాల, చౌటుప్పల్**

### రోజూ రాగి జావానే..



మా పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ రోజూ రాగి జావ ఇస్తున్నారు. ఏదో ఒకరోజు గుడ్డు ఇస్తున్నారు. మెనూ పాటించడం లేదు. దాంతో రోజూ జావ తినలేకపోతున్నాం. బ్రేక్‌ఫాస్ట్ మెనూ మార్చితే బాగుంటుంది.

**-ప్రాథమిక పాఠశాల విద్యార్థులు. తూర్పు గూడెం గ్రామం, చౌటుప్పల్ మండలం**

### రెండు నెలల బకాయి డబ్బులు రావాలి



నేను పోచంపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నా. రోజురోజుకు కూరగాయలు, గుడ్ల ధరలు పెరుగుతున్నాయి. మాకు రెండు నెలల నుంచి బకాయి డబ్బులు రావడం లేదు. గవర్నమెంట్ సరుకులు ఇస్తే బావుండేది. నెలనెలా మేము పెట్టుబడి పెట్టి సరుకులు, కూరగాయలు తెచ్చుకుంటున్నాం. మాకు చాలా ఇబ్బంది అవుతుంది. మాకు జీతం ఇచ్చి సర్కార్ సరుకులు ఇచ్చి వంట చేయమంటే మంచిగుండేది.

**- వనం లక్ష్మి, దయాసాగర్ మహిళా సంఘం, భూదాన్‌పోచంపల్లి**

### అమ్మ ఆదర్శ పాఠశాల పనులు దాదాపు పూర్తయ్యాయి



అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కింద పాచిల్ల ప్రాథమిక పాఠశాలకు 3 లక్షల 65 వేల రూపాయలు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. వాటితో పాఠశాల భవన మరమ్మతులు, తరగతి గదులలో లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లు, తాగునీరు, హ్యాండ్ వాష్ బేసిన్ వంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగంగా పూర్తి చేసేలా ముందుకు వెళ్తున్నాం.

**-కర్నె వీరేశం, ప్రధానోపాధ్యాయుడు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పాచిల్ల, గుండాల**



## యాదగిరిగుట్ట దేవస్థానంలో బదిలీలకు సిద్ధం

**34 మంది ఉద్యోగులు, 32 మంది అర్చకులు బదిలీ అయ్యే అవకాశం**

యాదగిరిగుట్ట, జూలై 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో విధులు నిర్వర్తించే మినిస్టీరియల్, సిబ్బంది బదిలీకి రంగం సిద్ధమవుతున్నది. 40 శాతం మంది ఉద్యోగులను బదిలీ చేయాలని రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చాలా కాలం నుంచి ఒకే చోట కొనసాగుతున్నందున బదిలీ చేయాలని నిర్ణయించింది. తాజాగా పదేండ్లు ఒకేస్థానంలో పని చేస్తున్న దేవస్థాన ఉద్యోగులకు స్థాన చలనం అనివార్యంగా మారింది. 34 మంది మినిస్టీరియల్ ఉద్యోగులు, 32 మంది అర్చక స్వాముల బదిలీ తప్పనిసరిగా కానున్నట్లు సమాచారం. దేవస్థానంలో మొత్తం 276 మంది మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారు. ఇందులో ప్రధానంగా ఒక డీఈఓ, ఐదుగురు ఏఈఓలు, 14 మంది సూపరింటెండెంట్లు, 18 మంది సీనియర్ అసిస్టెంట్లు, 20 మంది జూనియర్ అసిస్టెంట్లు, మరో 20 మంది రికార్డు అసిస్టెంట్లు, ఇతర సిబ్బందితో కలిసి సుమారు 86 మందిలో 34 మంది ఉద్యోగులు బదిలీపై వెళ్లే అవకాశం ఉంది. ఇకపోతే మత పర సిబ్బందిని పరిశీలిస్తే ఇద్దరు ప్రధానార్చకులు, నలుగురు ఉప ప్రధానార్చకులు, 8 మంది ముఖ్య అర్చకులు, 12 మంది అర్చకులు, ఏడుగురు పరిచారకులు, 8 మంది పాచకులు, ఇద్దరు వేదపారాయణందారులతోపాటు శివాలయం, సత్యనారాయణ వ్రతాలు, ప్రసాద విక్రయశాల పురోహితులు, అర్చకులను కలుపుకొని సుమారు 80 మంది అర్చక స్వాములు ఉండగా ఇందులో 32 మంది బదిలీ కాక తప్పదు. 2011 -12 సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో అప్పటి దేవస్థాన ఈఓ ప్రేమ్‌కుమార్ ఉన్న సమయంలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. యాదగిరిగుట్ట దేవస్థాన నుంచి కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం తదితర దేవస్థానాలకు పలువురు మినిస్టీరియల్ అధికారులు బదిలీపై వెళ్లారు.

12 ఏండ్ల తర్వాత మరోసారి బదిలీలు జరుగడంతో ఆలయ అధికారులు ఎవరికి స్థానం చలనం కలుగనుందో, ఏ ఆలయానికి వెళ్లాల్సి వస్తుందోనన్న ఆలోచనలో పడ్డారు.



మాజీ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ స్రవంతి, రవికుమార్

## రాష్ట్రానికి బీఆర్ఎస్ శ్రీరామరక్ష

- పార్టీ కార్యకర్తలు నిరుత్సాహ పడొద్దు
- అభివృద్ధి పనులు కొనసాగించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనలు తప్పవు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

గట్టుప్పల్/చండూరు, జూలై 9 : తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ శ్రీరామరక్ష అని, పార్టీ అధికారంలో లేనంత మాత్రాన కార్యకర్తలు నిరుత్సాహ పడొద్దని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. చండూరు మండల కేంద్రంలో మంగళవారం మాజీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలను శాలువాలు, జ్ఞాపకాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తూ, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటుందని, నిరుత్సాహానికి గురికావొద్దని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు బీఆర్ఎస్ ఎంతో కృషి చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం 572 కోట్ల రూపాయలను తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేపడితే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో కమీషన్ల కోసం పనులు ఆపుతున్నారని విమర్శించారు. పది రోజుల్లో అభివృద్ధి పనులు మొదలు పెట్టకపోతే ధర్నాలు, నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మాజీ ఎంపీపీ అవ్వారి గీతా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్పర్సన్ గుర్రం మాధవీవెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీశ్, మాజీ ఎంపీటీసీలు గౌరిగ సత్తయ్య, చెరుపల్లి భాస్కర్, కావలి మంగమ్మ ప్రసాద్, పెందుర్తి వెంకటమ్మ, మాజీ సర్పంచులు మెండు ద్రౌపత్తమ్మావెంకటరెడ్డి, ఇడెం రోజా, పంకెర్ల పద్మ, నాయకులు ఉజ్జిని అనిల్ రావు, మధుసూదన్ రావు, బొడ్డు సతీశ్, కూరపాటి సుదర్శన్ పాల్గొన్నారు.



రాజాపేటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## రాష్ట్రంలో రాక్షస పాలన

- అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు సహించం
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

రాజాపేట, జూలై 9 : కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నదని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెల్మిడి ఫంక్షన్‌హాల్లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో అమలు కాని హామీలతో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రైతు భరోసా, పింఛన్లు సకాలంలో ఇవ్వాలని, దళిత బంధు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. సాగు జలాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడంతో కరువుతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టిన దాఖలాలు లేవని, అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నాయకులు అరాచకాలు సృష్టిస్తూ బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి హింసించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ కనుమరుగై దాడుల పోలీసింగ్ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు. ఒకరిద్దరు పార్టీ వీడినంత మాత్రాన నష్టం లేదని, మరో వంద మంది కార్యకర్తలను తయారు చేసే దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. రాబోయే కాలంలో మళ్లీ గులాబీ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు సస్పెన్షన్

ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మోత్కుపల్లి జ్యోతీప్రవీణ్, మదర్‌డెయిరీ డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, అర్కాల గాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాయితీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పాండవుల భానుప్రకాశ్‌గౌడ్‌ను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు గొంగిడి మహేందర్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ వ్యతిరేఖ కార్యకలపాలకు పాల్పడినందుకు వారిని ఏకగ్రీవంగా తీర్మానం చేసి పార్టీ నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, బీఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, మదర్‌డెయిరీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింహులు, నాయకులు గుంటి మధుసూదన్ రెడ్డి, సట్టు తిరుమలేశ్, మర్ల నాగరాజు, రేగు సిద్దులు, ఎర్రగోకుల జశ్వంత్, మేక వెంకటేశ్వర్ రెడ్డి, గుంటి కృష్ణ, బోగ హరినాథ్, కటకం వెంకటేశం, కటకం స్వామి, బిల్లకుదురు రాజు, డొంకెన మహేందర్‌గౌడ్, బూర్గు నర్సిరెడ్డి, రెడ్డబోయిన రాజు, దేవులానాయక్, నాగిర్తి గోపిరెడ్డి, ఠాకూర్ ధర్మేందర్‌సింగ్, చెరుకు కనకయ్య, గొడుగు రాజు, మోత్కుపల్లి నవీన్, బాలకృష్ణ, భిక్షపతి, సిద్దులు పాల్గొన్నారు.

## ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీస్ శిక్షణ దరఖాస్తులకు నేడు ఆఖరు

నల్లగొండ, జూలై 9 : 2024-25 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బంజారా హిల్స్ హైదరాబాద్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత శిక్షణకు బుధవారంతో దరఖాస్తుల స్వీకరణ పూర్తి కానున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నవీన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 మందిని రాత పరీక్షల ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను గత నెల 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేస్తుండగా బుధవారంతో ముగియనుందని పేర్కొన్నారు. అర్హులైన వారు www.tsstudycircle.co.in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 040-23546552, 9396621492 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతితో కూడిన పది నెలల కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## 15, 16న గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్

నల్లగొండ, జూలై 9 : తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్-2 ఉచిత గ్రాండ్ టెస్టులకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు https://tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ తీసుకోవాలని, దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు కూడా టీజీపీఎస్సీ ఓటీఆర్, గ్రూప్-2 దరఖాస్తుతో తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండకు హాజరుకావాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో రెండో గ్రాండ్ టెస్ట్, 22, 23న మూడో టెస్ట్, 30, 31న మూడో గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు టీజీ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండలో లేదా 08682-220007 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## బంధువునంటూ వరుస కలిసి భారీ మోసాలు

- ఫేక్ కాల్స్‌తో 10 మంది నుంచి డబ్బులు వసూళ్లు

మిర్యాలగూడ, జూలై 9 : 'మామయ్యా నేను మీ బంధువును.. నీకు అల్లుడునవుతా... ఆసుపత్రిలో అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయి. డబ్బులు పంపించు తిరిగి మళ్లీ ఇచ్చేస్తా' అంటూ అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నాడు ఓ కేటుగాడు. ఇలా ఒక్కరిని కాదు ఇద్దరిని కాదు ఏకంగా వందలాది మందికి ఫేక్ కాల్స్ చేస్తూ వారితో మాట్లాడి డబ్బులు మినీ బ్యాంక్ అకౌంట్‌లో, పెట్రోల్ బంక్‌లకు వేయించుకొని ఎక్కడా దొరుకకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఇలా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ రియల్టర్ మోసగాడి మాటలను నమ్మి రూ.50 వేలు ఓ మినీ బ్యాంక్ ఏటీఎంకు పంపాడు. అంతటితో ఆగకుండా రూ.20 వేలు పంపాలని సదరు మోసగాడు కోరగా అనుమానం వచ్చిన బాధితుడు పూర్తి సమాచారం తెలుసుకొని ఫోన్ కట్ చేశాడు. తాను మోస పోయానని తెలుసుకున్న బాధితుడు మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయనకు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులకు దిమ్మ తిరిగే కాల్ డేటా లభ్యమైనట్లు తెలిసింది. అతడి బారిన సుమారు 1500 మంది వరకు పడి ఉంటారని కాల్ డేటా ఆధారంగా తెలుస్తున్నది. ఆ కాల్ డేటా ఓ నంబర్‌కు ఫోన్ చేసిన పోలీసులకు గుంటూరుకు చెందిన బాధితుడు బోరున విలపిస్తూ తాను రూ.90 వేలు పంపానని చెప్పాడని పోలీసులు పేర్కొంటున్నారు. కాగా సదరు మోసగాడు దామరచర్ల మండలం కొండ్రపోల్ వద్ద గల మినీ ఏటీఎం వద్ద అనుమానిత వ్యక్తి తచ్చాడినట్లు సీసీ పుటేజీలో గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే మోసగాడిపై పలువురు బాధితులు సైబర్ క్రైం పోలీసులకు సైతం ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

### ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఫేక్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా డబ్బులు పంపాలని అడిగితే ఎవరూ స్పందించవద్దు. ఓటీపీ నంబర్లు, వ్యక్తిగత అకౌంట్‌ల వివరాలను తెలియని వ్యక్తులకు చెప్పవద్దు. ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు గానీ, సైబర్ క్రైమ్ పోలీసులకు గానీ ఫిర్యాదు చేయాలి.

**-సుధాకర్, మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ**